# రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



రైతులు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ముసాపేట, మే 8 : భూములు ఉన్న రైతులు గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి, నందిపేట గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె హాజరై మాట్లాడారు. భూభారతి నూతన రెవెన్యూ చట్టంతో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కారమవుతున్నట్లు తెలిపారు. స్థానిక రైతులు తమ భూములకు ఉన్న సమస్యల దరఖాస్తులను స్వీకరించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలకు భూ భారతితో పరిష్కారం..!

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, మే 8 : భూ భారతి చట్టం అమలుతోనే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొమిరెడ్డిపల్లి, నందిపేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఆయన హాజరై అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలపై ఆరా తీశారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు శెట్టి శేఖర్, కృష్ణయ్య, నాగార్జునరెడ్డి, శ్రీహరి, విజయ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



మహబూబ్‌నగర్ అర్బన్ : క్రీడాకారులను అభినందిస్తున్న సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 8 : తమిళనాడు రాష్ట్రంలో 9 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 40వ జాతీయ స్థాయి సీనియర్ (మహిళ, పురుషుల) హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జే.శేషు, కే.పవన్, పీ.సుమతి తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో క్రీడాకారులను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు గోవింద్‌నాయక్, తకీమోద్దీన్, శంకర్‌నాయక్, రాంరెడ్డి అభినందించారు.

## 10న నెట్‌బాల్ జట్ల ఎంపిక

ధన్వాడ, మే 8 : నారాయణ పేట జిల్లా సబ్ జూనియర్ నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 10వ తేదీన బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌గౌడ్, అంజాద్‌అలీ తెలిపారు. ఉదయం 9 గంటలకు క్రీడకారులు బబార్ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని, అండర్-16 విభాగంలో ఈ ఎంపికలు ఉంటాయని తెలిపారు. ఆధార్‌కార్డు, రెండు పీపీ సైజ్ ఫొటోలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు జనగామ జిల్లాలో జరిగే 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

# బంద్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

నారాయణపేట, మే 8 : ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ సాగర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, కర్షక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మే 8 నుంచి 15వ తేదీ వరకు జీపు జాతాలు, సైకిల్ మోటార్ ర్యాలీలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని, మే 16 నుంచి 19వ తేదీ వరకు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రైతుల రుణాలన్ని మాఫీ చేసి రుణ విమోచన చట్టం చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులకు ఉపయోగపడేలా మార్చాలన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పథకం పని రోజులను 200 పెంచాలని, కూలీ రూ.600 పెంచాలన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వలస కార్మికులు, కౌలు రైతుల హక్కులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమ్మెకు, గ్రామీణ బంద్‌కు మద్దతు తెలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, మెప్మా ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్య ఉన్నారు.

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ దిగువ తెలిపిన వాటిని కొనుగోలు చేయదలిచారు:

1) గంగాపూర్ గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా వద్ద గల, సర్వే నెం.696/VUలో ఎక.0-39 గుంటలు, సర్వే నెం.696/VUUలో ఎక.0-19 గుంటలు మరియు సర్వే నెం.696/EEలో ఎక.1-37 గుంటలు విస్తీర్ణం, మొత్తం ఎక.3-15 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, శ్రీ మైలారం కృష్ణారెడ్డి తండ్రి శ్రీ చంద్రారెడ్డి-యజమాని (PPB No. T01100150060, ఖాతా నెం.81)కి చెందినది.

2) గంగాపూర్ గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా వద్ద గల, సర్వే నెం.696/VUU/1లో ఎక.1-18 గుంటలు మరియు సర్వే నెం.696/Eలో ఎక.1-37 గుంటలు విస్తీర్ణం, మొత్తం ఎక.3-15 గుంటలు విస్తీర్ణపు వ్యవసాయ భూమి యావత్తు, శ్రీ మైలారం చంద్రమౌళిరెడ్డి తండ్రి శ్రీ మైలారం చంద్రారెడ్డి-యజమాని (PPB No. T01100150140, ఖాతా నెం.188)కి చెందినది.

ఎవరికైనా పై సదరు విషయానికి సంబంధించి ఏదేని అభ్యంతరం లేదా ఇతర సమాచారం కలిగి ఉన్నచో వారు సదరు ప్రకటన తేదీ నుండి ఏడు (7) రోజులలోగా వ్రాతపూర్వకంగా అభ్యంతరాలను మరియు అన్ని సంబంధిత డాక్యుమెంట్లతో దిగువ సంతకందారును సంప్రదించవచ్చును, ఎలాంటి అభ్యంతరాలను అందనిచో ఎటువంటి క్లెయిమ్‌లు లేవని భావించబడును మరియు ఆ తరువాత అందిన ఏవేని క్లెయిమ్‌లు పరిగణించబడవు. నా క్లయింట్ సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌తో ముందుకు సాగుతారు.

**దేవాకర్.పి, అడ్వకేట్**
ప్లాట్ నెం.180/పి, త్రిమూర్తి కాలనీ, రోడ్ నెం.4, మహేంద్ర హిల్స్, సికింద్రాబాద్-500026,
**ఫోన్: (0)-27055585/ 27716501/ 27731757/ 27735558, మొబైల్ నెం.9849025380.**

# 13న పాలిసెట్

- జిల్లాలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 3,381 మంది విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలు



మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 8 : పాలిసెట్-2025 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సమన్వయకర్త మోహన్‌బాబు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలో పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈనెల 13వ తేదీన నిర్వహించే ఈ పరీక్షకు జిల్లాలో 3,381 మంది విద్యార్థులు రాయనున్నారని పేర్కొన్నారు. ఇందుకు గానూ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల, మహబూబ్‌నగర్ బాయ్స్ జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్‌లోని గర్ల్స్ జూనియర్ కాలేజ్, మెట్టుగడ్డలోని డైట్ కళాశాల మొత్తం ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి 1గంట ముందు తమ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హెచ్‌బీ పెన్సిల్, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, ఎరేజర్ తీసుకెళ్లాలని, మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ, మే 8 : వేసవి శిక్షణ శిబిరాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గోపాల్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వేపూర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల అవరణలో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవిలో కబడ్డీ, ఖోఖో, అలాగే చిన్నదర్‌పల్లి పాఠశాలల్లో చెస్, క్యారమ్స్, షటిల్ బాడ్మింటన్, డ్రాయింగ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎలాంటి డబ్బులు లేకుండా ఉచితంగానే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 21వ తేదీ వరకే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రామేశ్వరమ్మ, ఉపాధ్యాయులు భాను, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను వంద శాతం పరిష్కరించాలి

- పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూర్, మే 8 : భూ భారతి కొత్త చట్టం అమలకు పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైనా మద్దూర్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన భూ సమస్యలను వందశాతం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం మద్దూర్ రెవెన్యూ కార్యాలయంలో కొనసాగుతున్న భూ సమస్యల దరఖాస్తుల పరిశీలనను కలెక్టర్ పర్యవేక్షించారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ మండలంలోని మొత్తం 1,341 దరఖాస్తుల వెరిఫికేషన్ మరింత వేగంగా చేయాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్, ప్రోసిడింగ్, ల్యాండ్ సర్వే ఎంత వరకు వచ్చిందని భూ భారతి ప్రత్యేకాధికారి యాదగిరిని అడుగగా గురువారం నాటికి 75శాతం దరఖాస్తులను పూర్తి చేసినట్లు ప్రత్యేకాధికారి కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి, కోస్గి, గుండుమాల్ మండలాల తాసీల్దార్లు పాల్గొన్నారు.

# సమ్మె నోటీస్ అందజేత



మక్తల్ : డాక్టర్ తిరుపతికి సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

మక్తల్, మే 8 : కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఈనెల 20న చేపట్టే సమ్మెకు సంబంధించిన నోటీసులు కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ తిరుపతికి ఆశ కార్యకర్తలు సమ్మెల నోటీసులను అందజేసినట్లు సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి గోవిందరాజు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మిక, కర్షక హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా ఈనెల 20న పెద్ద ఎత్తున చేపట్టే సమ్మె కార్యక్రమంలో ఆశకార్యకర్తలు కూడ పాల్గొంటున్న నేపథ్యంలో కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ తిరుపతికి అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ, మే20వ తేదీన జరిగే సమ్మెలో ఆశ కార్యకర్తలు కూడ పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశకార్యకర్తల జిల్లా నాయకురాలు గోవిందమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు యశోద, మీనా బేగం, ఇందిరా, అనిత, సుజాత, సావిత్ర, లక్ష్మి, మహేశ్వరి, పార్వతమ్మ, వరలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

**మాగనూరులో..**

మాగనూరు, మే 8 : మే20వ తేదీన నిర్వహించే జాతీయ సమ్మెలో మాగనూరు, కృష్ణ మండలాల్లోని వివిధ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కార్మికులందరూ పాల్గొంటారని ఆయా మండలాల ఎంపీడీవోలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు గురువారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 20వ తేదీన సమ్మె జరగబోతున్నదని తెలిపారు. మండల కేంద్రంలో జరిగే నిరసన ప్రదర్శనలో గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కృష్ణ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణాల పనులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీసీఈవో వెంకట్‌రెడ్డి

జడ్చర్ల, మే 8 : ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలను పనులను ప్రారంభించాలని జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో చేపడుతున్న వివిధ పథకాల పురోగతిపై వివిధ శాఖల మండల అధికారులతో జెడ్పీసీఈవో జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా లేబర్‌రిపోర్టు, వ్యక్తిగత ఇంకుడు గుంతల ఏర్పాటు, ఉపాధి పేరా మీటర్లపై, ఇందిరమ్మ ఇండ్లు, నర్సరీ, రాజీవ్‌యువ వికాస పథకాల పురోగతిపై చర్చించారు. అనంతరం జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లిలో మొదటివిడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించి, ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్లనిర్మాణాలను పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, మండల ప్రత్యేకాధికారి జంగయ్య, హౌసింగ్ డీఈ విజయకుమార్, ఏఈ నర్సింహారెడ్డి, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు సన్మానం



ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక సభ్యులు

మహబూబ్‌నగర్, మే 8 : ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుడు నరేందర్ చారి, నరేందర్‌గౌడ్‌లతోపాటు కమిటీ సభ్యులను శాలువాలు, పూలబొక్కెలతో ఘనంగా సన్మానించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బుద్ధ భవనంలో ప్రెస్‌క్లబ్ ఎన్నికలలో గెలుపొందిన కమిటీ సభ్యులను ఆ సంస్థ సభ్యులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సమాజంలో మీడియా ఆది ప్రధాన భూమిక అని అనునిత్యం సమాజాన్ని జాగృతం చేయడంలో, తెలంగాణ ఉద్యమంలో కూడా మీడియాది ప్రముఖ పాత్రని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోకన్వీనర్ శ్రీనివాస్ యాదవ్, గోపాలకృష్ణ, కృష్ణయాదవ్, సురేశ్, రామలింగం, రమేశ్‌యాదవ్, వెంకటేశ్, సంతోష్, వెంకట్ రాములు, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ మెడికల్ అధికారిగా సుజాత

మహబూబ్‌నగర్ అర్బన్, మే 8 : మహబూబ్‌నగర్ ఆర్టీసీ మెడికల్ అధికారిగా డాక్టర్ సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమె విధుల్లో చేరగా గత ఏడాది డిసెంబర్‌లో ఇక్కడ నియమితులైన రమాకాంత్ హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ దవాఖానకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు గురువారం డాక్టర్ సుజాతను సన్మానించారు. కార్యక్రమంలో రాజసింహుడు, జీబీ పాల్, సాధిక్ ఆలీ, ఇసానుల్లా, అనిత, రాములు, రేఖ ఉన్నారు.

## సీసీ కెమెరాలతో భద్రత కట్టుదిట్టం

మరికల్, మే 8 : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాలతో భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాతకుర్వ కాలనీలోని మల్లీకార్జున స్వామి ఆలయంలో వీరశైవలింగాయాత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8సీసీ కెమెరాలను మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి, మరికల్ ఎస్సై రాములు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్, వీరన్న, బసన్న, తిప్పయ్య ఉన్నారు.

## ఆడవి పంది ఢీకొని వ్యక్తి మృతి

మూసాపేట, మే 8 : ఆడవి పందిని ఢీకొని ఓ యువకుడిని మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై వేణు తెలిపిన కథనం మేరకు గుడిపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం మూసాపేట మండలంలోని సంకలమద్ది జాతీయ రహదారిపై నిర్మస్తున్న వంతెన కాంట్రాక్టర్ ప్రతినిధి హనుమంతురెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి సమయంలో వేముల రోడ్డు మార్గంలో ఉన్న క్యాంప్ కార్యాలయం నుంచి జాతీయ రహదారివైపు వస్తున్నాడు. మార్గ మధ్యలో అతను వస్తున్న మోటర్ సైకిల్‌కు ఆడవి పంది ఢీ కొట్టింది. దీంతో అతనిడికి తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి ఎస్వీఎస్‌కు తరలించాగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

## కేజీబీవీలకు అప్‌గ్రేడ్

మరికల్, మే 8 : నారాయణ పేట జిల్లాలో మూడు కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేసినట్లు జీసీడీవో నర్మద తెలిపారు. మరికల్, మాగనూర్, కోస్గి కేజీబీవీలను పాఠశాల నుంచి కళాశాలుగా అప్‌గ్రేడ్ చేసినటు ఆమె పేర్కొన్నారు. పేట జిల్లాలో మొత్త 11 కేజీబీవీలలో ఇప్పటి వరకు 9కేజీబీవీలు ఇంటర్ కొనసాగుతుండగా, మరికల్, కోస్గి, మాగనూర్ కేజీబీవీల్లో ఇంటర్ ప్రారంభించడంతో 11 కేజీబీవీలకు గానూ 11 కేజీబీవీలు కళాశాలలుగా మారినట్లు తెలిపారు. మరికల్‌లో బైపీసీ, అగ్రికల్చర్ క్రాప్ పోర్డక్ట్ గ్రూపులు, మాగనూర్‌లో బైపీసీతో పాటు ఎంఎల్‌టీ గ్రూపులు, కోస్గి కేజీబీవీలో సీఈసీతో పాటు ఎంపీహెచ్‌ఏ(డబ్ల్యూ) గ్రూపులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మక్తల్, మే 8 : మక్తల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పాలమూరు విశ్వవిద్యాలయం అధికారులు సందర్శించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ నారాయణ గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-2026 విద్యా సంవత్సరానికి గానూ అఫీలియోషన్ పొడిగించుటకు కళాశాలను సందర్శించి వివిధ విభాగాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. కళాశాలలో సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, అదనపు తరగతులను వెంటనే సమకూర్చుకోవాలని కమిటీ సభ్యులు సూచించమని ఆయన తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

## సంఘీభావ ర్యాలీ

నారాయణపేట టౌన్, మే 8 : పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంపై భారత సైన్యానికి మద్దతుగా గురువారం స్థానిక నాయకులు సంఘీభావ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీవీఆర్ భవన్ నుంచి గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి తీవ్రవాదుల కాల్పుల్లో మరణించిన భారత పౌరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు సలీం, మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలోని ప్రతిపౌరుడు భారత సైనికులకు అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాజేశ్, సూర్యకాంత్, మనోజ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడుపోద్దు

నారాయణపేట, మే 8 : మద్యం తాగి వాహనాలు నడుపోద్దని ఏఎస్సై ఆంజనేయులు సూచించారు. గురువారం పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. పలు వాహనదారులకు బ్రీత్ అనలైజర్‌తో డ్రంకన్ కండీషన్‌తో తనిఖీలు చేసి మొత్తం ఏడుగురిపై డ్రంకన్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి జరిమానాతోపాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించిన కేసులు పునరావృతం అయితే వాహనాన్ని సీజ్ చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బాలానగర్, మే 8 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. మండలంలోని మోతీఘణపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి మాచారం శివారు వాగులోంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గురువారం మోతీఘణపూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేడు గ్రామసభ

మక్తల్, మే 8 : నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతుల వద్ద భూ సేకరణ చేపట్టేందుకు శుక్రవారం మండలంలోని ఐదు గ్రామాల్లో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ సతీశ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కాత్రేపల్లిలో శుక్రవారం ఉదయం 9గంటలకు, ఎర్నాగానిపల్లిలో 11 గంటలకు, టేకులపల్లిలో మధ్యాహ్నం 1గంటకు, కాచ్‌వార్ లో మధ్యాహ్నం 3గంటకు, మంతన్‌గౌడ్ లో 4 గంటల వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## డబ్బులు జమచేయాలి

ధన్వాడ, మే 8 : ప్రభుత్వం యాసంగి సీజన్‌ల్లో రైతులు విక్రయించిన వడ్లకు బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు వెంటనే బోనస్ వేయాలని డిమాండ్ చేశారు.

# రూ.6,909 ధర పలికిన పెసళ్లు

నారాయణపేట టౌన్, మే 8 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం 9 క్వింటాళ్ల పెసళ్లు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.6,909, కనిష్ఠంగా రూ.6,555 ధర పలికాయి. అదేవిధంగా 4 క్వింటాళ్ల జొన్నలు విక్రయానికి రాగా క్వింటా రూ.3,231 ధర పలికాయి. ఐదు క్వింటాళ్ల అలసందలు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.5,212, కనిష్ఠంగా రూ.5,025 ధర పలికాయి. 146 క్వింటాళ్ల హంసం రకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.1,823, కనిష్ఠంగా రూ.1,803 ధర పలికాయి. 2,931 క్వింటాళ్ల సోనాధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.2,126, కనిష్ఠంగా రూ.1,455 ధర పలికాయి. 5 క్వింటాళ్ల ఎర్రకందులు క్వింటా గరిష్ఠంగా రూ.6,711, కనిష్ఠంగా రూ.6,009 ధర పలికాయి. 1.47 క్వింటా తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.6,391, కనిష్ఠంగా రూ.6,009 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

## సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

నారాయణపేట టౌన్, మే 8 : లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండి కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఐటీఐ నుంచి డ్రాఫ్ట్ మన్(సివిల్), డిప్లొమా సివిల్ లేదా సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు ఓసీ అభ్యర్థులకు రూ.10వేలు, బీసీ అభ్యర్థులు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో తెలంగాణ అకాడమీ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8555813317ను సంప్రదించాలన్నారు.

## మహిళలకు అండగా షీటీం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

ఊట్కూర్, మే 8 : మహిళలకు అండగా షీటీం పనిచేస్తుందని షీటీం పోలీసులు చెన్నయ్య, బాలరాజు అన్నారు. గురువారం మండలంలోని పులిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌లో ఉన్న విద్యార్థులకు షీటీం పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా షీటీం పోలీసులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మహిళలను, విద్యార్థులను ఎవరైనా వేధించిన, శారీరకంగా మానసికంగా బాధపెట్టినా ధైర్యంగా షీటీం పోలీసులకు 8712670398 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీనెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ తాసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

జడ్చర్ల(మిడ్జిల్), మే 8 : మిడ్జిల్ మండలంలో ఇసుక అక్రమ తరలింపునకు, అక్రమంగా ఎర్రమట్టి, కెనాల్ మొరంమట్టిని అమ్ముకుంటున్న మాఫియాకు సహకరిస్తున్న మిడ్జిల్ తాసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని గురువారం మిడ్జిల్ రెవెన్యూ కార్యాలయం ఎదుట స్థానిక నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిడ్జిల్ మండలంలో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించే వారికి తాసీల్దార్ సహకరిస్తున్నారని అందుచేత పై అధికారులు విచారణ చేపట్టి తాసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, తిరుపతి, బుచ్చయ్య, వెంకట్ రెడ్డి, వాసుదేవ్, శ్రీనివాసులు, నరేశ్, జంగయ్య, ఆంజనేయులు, పరశురాములు, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయి

జడ్చర్ల(మిడ్జిల్), మే 8 : మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇసుకను తవ్వడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయని మిడ్జిల్ మండల తాసీల్దార్ రాజు తెలిపారు. గురువారం మిడ్జిల్ రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుందుబీ వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టడం లేదని, అనుమతులు ఇచ్చిన పట్టా భూముల్లో నుంచి ఇసుకను తవ్వడం జరుగుతుందన్నారు. దుందుబీ వాగులో పలకు వెళ్లేందుకు 12 సంవత్సరాల పైబడి రోడ్డు నిర్మించారని అదే రోడ్డును రైతులందరూ ఉపయోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇసుక అనుమతుల గురించి కొత్తపల్లి గ్రామరైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇసుక అనుమతులను రద్దు చేయడానికి తాసీల్దార్‌కు ఎలాంటి అధికారం లేదని పేర్కొన్నారు.

## క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడకారులకు దుస్తులు అందజేస్తున్న సభ్యులు

మక్తల్, మే 8 : వేసవిలో క్రీడా శిక్షణ తీసుకుంటున్న క్రీడకారులకు క్రీడా దుస్తులను అందజేసినట్లు పీడీ రూప శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థులకు ఖోఖో, పాటు ఇతర క్రీడాల్లో శిక్షణనిస్తున్న క్రీడా శిబిరంలోని క్రీడకారులకు కర్ని గ్రామానికి చెందిన లక్కీయూత్ అసోసియేషన్ సభ్యులు 50మంది బాలబాలికలకు క్రీడా దుస్తులను అందజేశారు. లక్కీ యూత్ అసోసియేషన్ సభ్యులు విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్, మారుతి, నర్సింహ, దత్తు, రవి, నర్సింహ, రవి, విష్ణు, ప్రవీణ్ ఉన్నారు.

## విద్యార్థిని ఆత్మహత్య

జడ్చర్లటౌన్, మే 8 : ఉరేసుకొని ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకున్నది. సీఐ కమలాకర్ కథనం మేరకు మండలంలోని పోలేపల్లికి చెందిన ద్రాక్షవల్లి(15) అనే విద్యార్థి తన ఇంట్లోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకున్నది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జడ్చర్ల సర్కారు దవాఖానకు తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన విష్ణు, వెంకటమ్మ ప్రేమ విషయంలో తనతో గొడపడటంతోనే తన కుమార్తె మానస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని, ఇందుకు కారణమైన విష్ణు, వెంకటమ్మలపై చర్యలు తీసుకోవాలంటూ మృతురాలి తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.